## క్లుప్తంగా

### ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది



కొమ్మూరు(కాకుమాను): అన్ని వృత్తుల్లో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని కొమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర అధ్యాపకురాలిగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేయనున్న ఎం.ఎస్.ప్రేమ కుమారి అభినందన సభ శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ కెనడీ మాట్లాడుతూ గత 33 సంవత్సరాల నుంచి ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేశారని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగంలో ఎలాంటి మచ్చ లేకుండా ఉద్యోగ విరమణ చేయడం ఎంతో అదృష్టమని పేర్కొన్నారు. ఈసందర్భంగా ప్రేమ కుమారి, విక్టర్ జాన్‌పాల్ దంపతులను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

### విజ్ఞాన్‌లో ఘనంగా వరలక్ష్మీ వ్రతం



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ యూనివర్సిటీ సిబ్బంది, పలువురు విద్యార్థులు సామూహిక వ్రత పూజలు చేశారు. వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ వ్రతమంటే నియమబద్ధమైన నడవడిక, క్రమశిక్షణతో కూడిన ఆచరణ, వ్యక్తిగత, వృత్తిగత జీవితాల్లో ప్రాముఖ్యాన్ని తెలియజెప్పడమే వ్రతం ఆంతర్యమన్నారు. జీవితంలో ఏ బాధ్యతల్ని స్వీకరించినా ఉత్తమంగా నిర్వర్తించాలన్నారు. చదువైనా, ఇతర పనులైనా మనసుపెట్టి పూర్తి చేయాలని తెలిపారు. ప్రసన్నంగా, కారుణ్యంతో సౌమ్యలక్ష్మిగా కనిపించే ఆ తల్లే ఆగ్రహిస్తే వీరలక్ష్మిగా మారుతుందన్నారు. ఆశావహ దృక్పథంతో విజయం సాధిస్తే జయలక్ష్మిని, తలపెట్టిన కార్యానికి కావాల్సిన విజ్ఞానం, సమయస్ఫూర్తి, నిర్ణయ శక్తులను సంపాదించడం ద్వారా విద్యాలక్ష్మిని ఆరాధించవచ్చునన్నారు. మిగిలిన లక్ష్మీ పూజల కంటే వరలక్ష్మీ పూజ శ్రేష్ఠమని, విశేష ఫలితాలు దక్కుతాయని తెలిపారు. విదేశీయులు సైతం ప్రస్తుతం మన సంప్రదాయాలను ఆచరిస్తున్నారని తెలిపారు. మన పండుగలు, వాటిని జరుపుకునే తీరు చూసి ప్రపంచం అబ్బురపడుతోందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య సతీమణి లావు నిర్మల, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

### మంచాలలో ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు



మంచాల(చేబ్రోలు): శ్రావణ మాసం చివర శుక్రవారం సందర్భంగా చేబ్రోలు మండలం మంచాల గ్రామంలోని ఆది లక్ష్మీ కామేశ్వరి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ వ్యవస్థాపకులు శిష్టా ల పూర్ణనంద శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

### ఆలయానికి రూ.లక్ష విరాళం

ఆగిరిపల్లి: ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని దుగ్గిరాల రావమ్మ తల్లి ఆలయంలో భక్తుల విశ్రాంతి గది నిర్మాణానికి గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మామిళ్లపల్లికి చెందిన ఈగ మాధవరావు రూ.1.05 లక్షల విరాళంగా ఆలయ ఈఓ సురేష్‌బాబుకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను పలువురు అభినందించారు.

### నర్సరీలో అగ్ని ప్రమాదం

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో కూరగాయల మొక్కల పెంపకం కేంద్రంలోని కార్యాలయం శుక్రవారం దగ్ధమైంది. మండల కేంద్రమైన చేబ్రోలు–నారాకోడూరు గ్రామాల మధ్య జీబీసీ రహదారి పక్కన జాలాది సుభాష్‌చంద్రబోస్ సన్స్ చిల్లీస్ వెజిటెబుల్స్ నర్సరీని కొంతకాలంగా నిర్వహిస్తున్నాడు. నర్సరీలో పనిచేసే వారి కోసం ఏర్పాటు చేసిన షెడ్డులో ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం జరిగింది. సిబ్బంది పొయ్యి మీద వంట చేస్తుండగా పక్కనే ఉన్న మొక్కల పెంపకానికి ఉపయోగించే ప్లాస్టిక్ ట్రేలకు నిప్పు అంటుకుంది. ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దట్టమైన పొగతో పరిసరాలు వ్యాపించాయి. గుంటూరు–2 నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాద సంఘటనలో షెడ్డులో ఉన్నటువంటి ప్లాస్టిక్ ట్రేలతో పాటు, వంట సామగ్రి, వస్తువులు, ఫర్నిచర్ కాలిబూడిదైంది. షెడ్డుపై భాగం కొంతభాగం దెబ్బతింది. సుమారు లక్ష రూపాయల వరకు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

---

### చట్టాలు పటిష్టం అమలు చేయాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రత చట్టాలు మరింత పటిష్టం చేయాలి. విధులు నిర్వర్తించే ఇతర అధికారులపై చేయి చేసుకోవడం ఎంత నేరమో అలాగే విధి నిర్వహణలో ఉన్న వైద్యులపై దాడి చేయడం అంతే. అమర్యాదగా మాట్లాడే వారిని కఠినంగా శిక్షించాలి. భద్రత కోసం ప్రత్యేకంగా చట్టాలు తీసుకురావాలి. వైద్యులంటే ప్రాణ రక్షకులన్న గౌరవంతో పాటు వారి జోలికి వెళితే చట్టాలు వదలవు అన్న భయం ఉండాలి.

–ఎ.విమలమ్మ, ఏఎన్‌ఎం, దొప్పలపూడి

### వైద్యశాలల్లో మహిళలకు రక్షణ కల్పించాలి



కోల్‌కతాలో జరిగిన లాంటి ఘటనలు భవిష్యత్‌లో పునరావృత్తం కాకుండా మహిళా వైద్యులు, సిబ్బందికి సరైన రక్షణ కల్పించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వైద్యుల రక్షణకు బలమైన రక్షణ చట్టాలు తీసుకురావాలి. నిరంతరం రోగులకు సేవలందించే మహిళలపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేకుంటే విధులు నిర్వర్తించడం కష్టతరమవుతోంది.

– ఎ.రాణిమ్మ, ఏఎన్‌ఎం, దండమూడి

# మా ఎస్టీ కాలనీని చిన్న చూపు చూస్తున్నారు

- సైడు కాల్వలు తీసిన పాపాన పోలేదు
- వీధి దీపాలు వేసే దిక్కు లేదు
- నెలల తరబడి మొత్తుకుంటున్నా పట్టించుకునే వారు లేరు
- పౌర హక్కుల దినోత్సవంలో అధికారుల ఎదుట వాపోయిన ఎస్టీ కాలనీ వాసులు




పౌరహక్కుల దినోత్సవంలో అధికారులకు సమస్యలను మొరపెట్టుకుంటున్న ఎస్టీ కాలనీ వాసులు

ప్రత్తిపాడు: ఏళ్ల తరబడి మా ఎస్టీ కాలనీపై అధికారులు చిన్న చూపు చూస్తున్నారని ఎస్టీ కాలనీ వాసులు అధికారుల ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు ఎస్టీ కాలనీలో శుక్రవారం సాయంత్రం సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ కె.రవిబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎస్టీలు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఎన్నో రోజులుగా కాలనీలో మురుగు కాలువలు తియ్యమని అడగుతున్నామని కానీ పట్టించుకున్న వారు లేరని వాపోయారు. వీధి దీపాలు వేయమని పదే పదే మొత్తుకుంటున్నా వేసే దిక్కులేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఫలితంగా రాత్రి పూట విషసర్పాల భయం వెంటాడుతోందన్నారు. సైడు కాలువల్లో మురుగు పేరుకుపోయి దోమల ఉధృతి పెరుగుతుందన్నారు. అపరిశుభ్ర వాతావరణం మధ్య బతుకుతూ రోగాల బారిన పడుతున్నామని నెత్తీనోరూ బాదుకున్నారు. స్పందించిన తహసీల్దార్ పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా తీసుకుని మన ప్రాంతాన్ని మనమే బాగు చేసుకుందామని సూచించారు.

**కొడుకుగా చెబుతున్నా.. మీ రేషన్ కార్డు కట్ చేస్తా**

మీ కొడుకుగా చెబుతున్నా.. మీ పిల్లలను బడికి పంపకపోతే మీ అందరి రేషన్ కార్డులు కట్ చేస్తానని తహసీల్దార్ రవిబాబు ఎస్టీ వాసులకు హెచ్చరించారు. స్థానిక కాలనీ నుంచి అనేక మంది పిల్లలు బడికి వెళ్లడం లేదని, ఎంత మంది ఎన్ని సార్లు చెప్పినా తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదని విద్యాశాఖ అధికారులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో స్పందించిన తహసీల్దార్ మీ పిల్లలను ప్రతి రోజూ పాఠశాలకు పంపాలన్నారు. నెలలో 28 రోజులు పిల్లలను బడికి పంపని తల్లిదండ్రులను గుర్తించి వారి రేషన్ కార్డులు కట్ చేస్తామని, అదే విధంగా పింఛన్ పొందుతున్న వారి పింఛన్ నిలిపివేస్తామని స్పష్టం చేశారు. అనంతరం కాలనీలో పర్యటించి నివాస ప్రాంతాల మధ్యనున్న మురుగును అధికారుల బృందం పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీవో వి.సుజాతదేవి, ఎంఈఓ సీహెచ్ రమాదేవి, హెచ్ఓ బేబి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్, ఆర్ఐ సాహితి పాల్గొన్నారు.

### వైభవంగా సీతారామస్వామి
## ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు





ప్రతిష్ట మహోత్సవానికి సిద్ధమైన ఆలయం (ఇన్‌సెట్) విగ్రహానికి పూజలు చేస్తున్న ఆలయ కమిటీ

పొన్నూరు: మండలంలోని కసుకర్రులో సీతారామస్వామి నూతన ఆలయ ప్రతిష్ట, అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గోపూజతో కార్యక్రమాలను ప్రారంభించి విశేష పూజలు, హోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శనివారం ఉదయం 7 గంటలకు గోపూజతో ప్రారంభించి సీతారామస్వామి నూతన ఆలయ ప్రతిష్ట, మహా కుంభాభిషేకం, పూర్ణాహుతి, శాంతి కల్యాణం, భారీ అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు వడ్లమూడి సంగమేశ్వర దీక్షితులు నిర్వహణలో జరుగుతాయన్నారు.

# పచ్చదనంతో గ్రామాల్లో ఆహ్లాదం



తిక్కిరెడ్డిపాలెంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంఈఓ రమాదేవి



నిమ్మగడ్డవారిపాలెంలో మొక్కలు నాటుతున్న తహసీల్దార్ కె.రవిబాబు



మిట్టపల్లి కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ గోపికృష్ణ



కాకుమాను ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న సర్పంచి శివకుమారి



నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు



ఆర్‌వీఆర్‌జేసీలో మొక్కలు నాటుతున్న కళాశాల యాజమాన్యం

ప్రత్తిపాడు: పచ్చదనంతో గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుందని తహసీల్దార్ కె.రవిబాబు అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని నిమ్మగడ్డవారిపాలెంలో స్థానిక రక్షిత తాగునీటి చెరువు గట్టుపై మొక్కలు నాటారు. నడింపాలెంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రామకోటయ్య, యనమదలలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్‌కుమార్, గొట్టిపాడులో వెటర్నరీ డాక్టర్ నందకిషోర్, గనికపూడిలో హౌసింగ్ ఏఈ సాగర్‌సురేష్, కోయవారిపాలెంలో ఎంఈవో–2 జి. లీలారాణి, తిక్కిరెడ్డిపాలెంలో ఎంఈఓ రమాదేవి, ఫారెస్ట్ అధికారి భాస్కర రావు, పాతమల్లాయపాలెంలో ఏఓ అరుణ కుమారి మొక్కలు నాటారు.

■ మండల పరిధిలోని తుమ్మలపాలెం మిట్టపల్లి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో వన మహోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.గోపికృష్ణ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ ఎంబీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి**

కాకుమాను: ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పాఠశాల కార్యదర్శి, కరస్పాండెంట్ ముద్దన నాగరాజ కుమారి అన్నారు. పెదనందిపాడు మండలంలోని లయన్స్ మాంటిస్సోరి పాఠశాల ఆవరణలో శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో అరవపల్లి కృష్ణమూర్తి, హెచ్ఎం కిరణ్ జోస్ పాల్గొన్నారు. కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామ సర్పంచి పసుపులేటి శివకుమారి మొక్కలు నాటి విద్యార్థులకు మొక్కల యొక్క ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో నల్లమోతు పూర్ణయ్య, ఎంపీడీఓ పి.రామకృష్ణ, జవహర్‌రాణి పాల్గొన్నారు.

**ఆర్‌వీఆర్‌జేసీలో వనమహోత్సవం**

గుంటూరు రూరల్: హరితాంధ్రప్రదేశ్ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. శుక్రవారం చౌడవరంలోని కళాశాలలో వనమహోత్సవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు కళాశాల కూడళ్లలో అధ్యాపక బృందంతో కలసి మొక్కలు నాటారు. సంపూర్ణ ఆరోగ్య జీవనానికి మంచి పర్యావరణం అవసరమని, అందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. తమ కళాశాల ఆధ్వర్యంలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమం విజయవంతానికి పెద్ద సంఖ్యలో మొక్కలు అందించి కార్యక్రమ విజయానికి సహకరించిన అటవీ శాఖ సిబ్బందికి కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ డి.కృష్ణప్రసాద్, డాక్టర్ జి.రామ్మోహన్‌బాబు, డాక్టర్ ఎం.సుధాకర్, డాక్టర్ కె.ఉపేంద్రచౌదరి, డాక్టర్ డి.కొండలరావు, డాక్టర్ ఎం.అనిత పాల్గొన్నారు.

**నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో..**

చేబ్రోలు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న వనమహోత్సవంలో భాగంగా నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కొరకు విద్యార్థులు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. వన సంరక్షణ– మన సంరక్షణ అని మొక్కల యొక్క ప్రాముఖ్యతను వాటి ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ పుట్టినరోజున ఒక మొక్కను నాటాలని దాన్ని సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, వై.రాజారెడ్డి, సిహెచ్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బీ ప్లస్ గ్రేడ్




చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవికి సర్టిఫికెట్‌ను అందజేస్తున్న నాక్ బృందం

చేబ్రోలు: చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బీ ప్లస్ గ్రేడ్‌ను మంజూరు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి శుక్రవారం తెలిపారు. ఈ నెల 21, 22వ తేదీలలో నాక్ పీర్ టీం వారు కళాశాలలోని వివిధ విభాగాల రికార్డులను, కళాశాలలో జరుగుతున్న విద్యాబోధనా పద్ధతులు, అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ బృందం వారు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశాలను నిర్వహించి, కళాశాలలోని వసతులు తరగతి గదులు పరిశీలించి వారి నివేదికను అందజేశారు. సదరు నివేదిక ప్రాతిపదికన బెంగళూరుకు చెందిన నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) వారు చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 2.62 సీజీపీఏతో బీ ప్లస్ గ్రేడును మంజూరు చేశారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, నాక్ కో ఆర్డినేటర్ ఏ రామకృష్ణ తెలిపారు. ఈ హోదా ఐదు సంవత్సరాల పాటు కొనసాగుతుందని తెలిపారు.

## మార్కెటింగ్‌పై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: వర్క్‌షాపులు నిర్వహించటం వలన విద్యార్థుల్లో ఆలోచనాశక్తి, సృజనాత్మకత మెరుగు పరచవచ్చని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. శుక్రవారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో కళాశాల, ఐవీఏసీ, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, హిందూస్థాన్ కోకాకోలా బేవరేజెస్ సంస్థల సంయుక్తంగా విద్యార్థులకు సేల్స్ మార్కెటింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న సదస్సు ముగింపు వేడుకల్లో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వ్యాపారాభివృద్ధి చెందాలంటే ముందుగా మార్కెటింగ్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. వై4డీ ఫౌండేషన్ ప్రతినిధులు జీ బెనర్జీ, వినయ్, శ్రీనివాస్ మార్కెటింగ్ స్కిల్స్ గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అర్.షారోన్‌రోజ్, డాక్టర్ జె.ప్రతాప్‌రెడ్డి, జి.రాధిక, జె.ప్రమీల పాల్గొన్నారు.



విద్యార్థినులతో కళాశాల యాజమాన్యం



### ఊకే కదా అనుకుంటే ప్రమాదమే..

ప్రత్తిపాడు: పాతమద్రాసు రోడ్డుపై ప్రమాదం పొంచి ఉంది. గుంటూరు పర్చూరు రోడ్డులో ప్రత్తిపాడు తిక్కిరెడ్డిపాలెం మధ్యలో వరిపొట్టు ఊక రోడ్డు మార్జిన్లో పడి ఉంది. పొరబాటున ఆ మార్గంలో వెళ్లే వాహన చోదకులు ఊకపై వాహనం నడిపితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. నిత్యం ఈ మార్గంలో వందల వాహనాలు వెళుతుంటాయి. అందులో ద్విచక్ర వాహన చోదకులు హై స్పీడులో వెళుతుంటారు.





ట్రాక్టర్‌పై పొలాలకు వెళ్తూ

### ఎడతెరిపి లేని వర్షం



బైక్‌పై వర్షంతో వెళుతున్న ఫ్యామిలీ

ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో శుక్రవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా ప్రత్తిపాడులో వర్షం కురుస్తోంది. ముసురు పట్టడంతో జనజీవనం ఇబ్బందులు పడుతూ వానలోనే తమ పనులకు వెళ్లాల్సి వచ్చింది. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు మండలంలో 10.2 మి.మీ., పెదనందిపాడు మండలంలో 13.4 మి.మీ., వట్టిచెరుకూరు మండలంలో 5.2 మి.మీ., కాకుమాను మండలంలో 11.4 మి.మీ., వర్షపాతం నమోదైంది. రోజంతా ఆకాశం మేఘావృతమై కారుచీకట్లు కమ్ముకున్నాయి.

–ప్రత్తిపాడు

### వ్యక్తిపై దాడి

పట్నంబజారు: డబ్బులు ఇవ్వలేదని కారణంతో వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. మోతిలాల్ నగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ బాషా ఈనెల 29వ తేదీ రాత్రి నెహ్రూ నగర్ ఒకటో లైన్‌లో టిఫిన్ చేసేందుకు వెళ్లారు. ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వచ్చి డబ్బులు ఎంత ఉన్నాయో ఇవ్వాలంటూ బెదిరింపులకు దిగారు. అయితే తన వద్ద డబ్బులు లేవని చెప్పిన బాషాను దాడి చేసి గాయపరిచారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.